**రోయ్ లే-అవుట్‌లో**
**40x40 కమర్షియల్ గొడౌన్ గ్రౌండ్ ఫ్లోర్**
**40x40 ఫస్ట్ ఫ్లోర్**
**అద్దెకు ఇవ్వబడును**
కాంటాక్ట్ నెంబర్లు 9441937973 9440343432
నియర్ జోసెఫ్ కాన్వెంట్, శ్రీకాకుళం.

పేపర్ బాయ్స్
**కావలెను**
సంచలన సాయంకాల పత్రిక 'సత్యం'లో పని చేసేందుకు పేపర్‌బాయ్స్ కావలెను.
- సంప్రదించండి -
94414 66455


SOLVE ACADEMY
Dwaraka Nagar 3rd Line, Data Pro Apartment 3rd Floor, Visakhapatnam. | Ramakrishna Nagar, Behind RTC Complex, Srikakulam, A.P. - 532001.
SSC CONSTABLES &RRB GROUP -D OUR TARGET
COMPETITIVE EXAMS COACHING!!!
*CRASH COURSE (2 Months) 5000 ₹ Only
JOIN TODAY
• 6 HOURS DAILY CLASSES
• COVER COMPLETE SYLLABUS
• ARITHMETIC/REASONING/GS/ GK/ENGLISH
• CHAPTER WISE TESTS
• GRAND TESTS
• COURSE PRINTED MATERIAL
FOR MORE INFORMATION
75690 89825, 90595 20982
86881 72010, 90300 28181

సంచలన సాయంకాల పత్రిక
# సత్యం
https://www.satyamdaily.net/
గురువారం 17-10-2024
సంపుటి: 20 సంచిక: 174
పేజీలు: 4 వెల: రూ.1

**ICL COURIER**
INTERNATIONAL COURIER & CARGO
విదేశాలకు అతి తక్కువ ధరలో వేగవంతమైన సర్వీసు
పచ్చళ్లు ‣ బట్టలు ‣ పిండివంటలు ‣ బుక్స్ ‣ స్వీట్స్ ‣ మెడిసిన్స్ మొదలగునవి పంపించబడును.
- Free Door Step Pickup - World wide Services
- Low Cost & Fastest Delivery - Easy Online Tracking
- Safe & Secure Delivery - Free Box Packing
దూదివారి కోవెల ప్రక్కన, చిన్నబజార్ రోడ్, శ్రీకాకుళం.
9989172822, 9505944472, 9248199493

NOW OPEN
10% DISCOUNT on 999/- FOR SATYAM SUBSCRIBERS
The Eastern Marine Drive In
(A/C) FAMILY RESTAURANT
EAT. PLAY. ENJOY.
Chikkol Harbour
INDIAN | CHINESE | BIRYANI | TANDOORI

EASTERN MARINE DRIVE-IN
NH16 Service Road, Kushalipuram, Srikakulam
+91 9652629676 / +91 8555918685
Available On zomato






- ఇసుక టెండర్లు రద్దు
- దక్కించుకున్నవారి చరిత్రే కారణం
- శాండ్ కమిటీలో అధికారిపై కలెక్టర్ ఆగ్రహం
- నోటిఫికేషన్ నుంచి నివగాం మినహాయింపు

# ఒకడుగు ముందుకు నాలుగడుగులు వెనక్కి

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

ఉచిత ఇసుక పాలసీలో అసలు ఏం జరుగుతుందనేది స్వయంగా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకే అర్థం కావడంలేదు. మద్యం, ఇసుక దందాల్లో తలదూరుస్తున్న నేతలనుద్దేశించి ఆయన క్లాస్ పీకారని పత్రికల్లో వచ్చిన కథనాల ప్రకారం ఇసుక పాలసీమీద గందరగోళం ఉందని స్వయంగా చంద్రబాబే వ్యాఖ్యానించినట్లు తెలుస్తుంది. నది నుంచి ఇసుకను ఒడ్డుకు తరలించడానికి ప్రభుత్వం పిలిచిన టెండర్లలో నిబంధనలు కఠినతరంగా ఉండటంతో కేవలం బయటి వ్యక్తులు మాత్రమే దీనికి అర్హత సాధించారు. అలా అని వీరి గత చరిత్ర చూస్తే పూర్తిగా ఇసుకను కొల్లగొట్టేసినట్లు తెలుస్తుంది. గతంలో అనేకచోట్ల టెండర్లు వేసి ర్యాంపులు దక్కించుకున్న సంస్థలకే ఈసారి కూడా అవకాశం దక్కడంతో స్థానిక తెలుగుదేశం నేతలు పూర్తిగా అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. టెండరు ప్రక్రియ ప్రకారమైతే వారికే ఇవ్వాలి. కానీ వాస్తవ పరిస్థితులు అందుకు భిన్నంగా ఉన్నాయి. ఒక మెట్రిక్ టన్ను ఇసుకను నదిలో తవ్వి, ట్రాక్టర్‌లో లోడ్ చేసి, బయట వేయడానికి రూ.19 ఒక సంస్థ కోట్ చేసిందంటే.. రేపు రీచ్ చేతికొచ్చిన తర్వాత ఏం చేయబోతుందో వేరేగా చెప్పనక్కర్లేదు. మరో సంస్థ రూ.110 వరకు ధర వేసుకోవచ్చని ప్రభుత్వం చెబితే రూ.61 కోట్ చేసిందంటే ఎంత మొత్తం ఇసుకను సొంతానికి వాడేస్తారో తెలుస్తుంది. అయితే ప్రభుత్వం పెట్టిన నిబంధనలు అలా ఉండటం వల్ల ఆ అర్హతలు ఉన్న సంస్థలే ఇప్పుడు టెండరులో పాల్గొన్నాయి. వాస్తవానికి మూడో కంటికి తెలియకుండా తెలుగుదేశం నేతలే ఈ టెండరులో పాల్గొని ర్యాంపులను దక్కించుకోడానికి ఎక్కడా ప్రచారం లేకుండా నోటిఫికేషన్ విడుదల చేశారు. అసలు మొదటి నోటిఫికేషన్ ఎప్పుడు వచ్చిందో, ఎప్పుడు ముగిసిపోయిందో కూడా దసరా సెలవుల్లో తెలియలేదు. బుధవారం వేసిన రెండో నోటిఫికేషన్‌లో కూడా ముందస్తు తేదీ అంటే 15.10.2024 వేసి 18వ తేదీ సాయంత్రంతో టెండర్లు ముగుస్తున్నట్టు ప్రకటించారు. దీనర్థం తెలుగుదేశం నేతలు దక్కించుకుంటారని. కానీ ఇసుక పాలసీలో విధించిన నిబంధనల ప్రకారం తెలుగుదేశం నేతలెవరూ ఆ పారామీటర్లలో సరిపోవడంలేదు. దీంతో బయటి వ్యక్తులే ఇసుక సీనరీలను సొంతం చేసుకునే పరిస్థితి వచ్చింది. అలా అని వీరు సమర్పించిన పత్రాలేమైనా శతశాతం సరైనవా? అంటే.. అదీ కాదు. కేవలం గతంలో చేసిన అనుభవం వల్ల ఇటువంటి పత్రాలు సృష్టించడంలో కొందరు ఆరితేరిపోయారు. ఇప్పుడు ఆ పత్రాలతోనే టెండర్లు దక్కించుకున్నారు. ఈ వ్యవహారం బయట పడటంతో మొత్తం టెండర్ల ప్రక్రియనే కలెక్టర్ తాత్కాలికంగా రద్దుచేసి పారేశారు.


జిల్లాలో మొదట నోటిఫికేషన్‌లో బిడ్‌లు ఆహ్వానించగా వచ్చిన 38లో చివరికి మూడు ఏజెన్సీలకు ఓకే చెప్పారు. వీటిలో బుల్‌టెక్ సంస్థ పేరుతో గతంలో ఇసుక వ్యాపారం చేసిన అంధవరపు జగన్‌ను ముందు పెట్టి కొందరు వైకాపా నాయకులు బూరవల్లి, అంబళ్లపేట, గోపాలపెంట ర్యాంపులు దక్కించుకున్నారు. వీరి గతచరిత్ర ఘనం కావడంతో రాష్ట్రమంత్రి అచ్చెన్నాయుడు వరకు ఈ వ్యవహారం వెళ్లింది. దీంతో గోపాల 'పెంట' చేసేశారని రెండు రోజుల క్రితం 'సత్యం' కథనం కూడా ప్రచురించింది. హయాతినగరం, బట్టేరును చెరో ఏజెన్సీ దక్కించుకున్నాయి. వీటి చరిత్రనూ తవ్వితీయాల్సిన అవసరం ఉంది.

ఈ నెల 16 నాటికి రాష్ట్రవ్యాప్తంగా మొదటి విడతలో 108 ఇసుక రీచ్‌ల టెండర్లు పూర్తిచేసి ఉచిత ఇసుకను అందుబాటులోకి తీసుకురావాలని కూటమి ప్రభుత్వం నిర్ణయానికి అనేక అడ్డంకులు ఉన్నాయి. ఈ నెల 11న ఆన్‌లైన్‌లో టెండర్లు ఆహ్వానించి 16 నాటికి కేటాయింపు ప్రక్రియ పూర్తిచేయాలని నిర్ణయించినా ప్రభుత్వానికి సాధ్యం కాలేదు. రాష్ట్రంలో కేవలం గుంటూరు, విజయనగరంతో పాటు మరో జిల్లాలో మాత్రమే రీచ్‌ల కేటాయింపు ప్రక్రియ పూర్తి చేశారు. ప్రభుత్వం నూతన ఇసుక

- మిగతా 4లో

## అరకు వ్యాలీకి హెలిప్యాడ్ సేవలు ప్రారంభించాలి

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)



అరకు వ్యాలీకి హెలిప్యాడ్ సేవలు ప్రారంభించాలని కేంద్ర మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడుని విజయనగరం ఎంపీ, ఐ.టీ, కమ్యూనికేషన్ పార్లమెంట్ స్టాండింగ్ కమిటీ సభ్యులు కలిశెట్టి అప్పలనాయుడు గురువారం డిల్లీలో మర్యాదపూర్వకంగా కలిసి వినతిపత్రం అందించారు. అరకు వ్యాలీ ప్రాకృతిక సౌందర్యం, స్థానిక తెగల సంస్కృతిని ప్రతిబింబించే గొప్ప పర్యాటక ప్రాంతమని, గిరిజన మ్యూజియం, పద్మాపూర్ గార్డెన్స్ వంటి విశేష ఆకర్షణీమైన ప్రాంతాలు ఉన్నాయని మంత్రి రాముకు వివరించారు. పర్యాటకులు అరకు వ్యాలీకి చేరుకోవడంలో ఇబ్బందులు ఎదురవుతున్న కారణంగా, హెలిప్యాడ్ ఏర్పాటుతో సులభమైన ప్రయాణ సదుపాయాలు కల్పించవచ్చన్నారు. దీని వల్ల స్థానికుల ఆపద పరిస్థితుల్లో సత్వర రవాణా, పర్యాటక వృద్ధికి తోడ్పడుతుందని అభిప్రాయపడ్డారు. ఈ ప్రతిపాదనను కేంద్ర ప్రభుత్వం పరిశీలిస్తే, అరకు వ్యాలీ పర్యాటక రంగం మరింత అభివృద్ధి చెందుతుందని, స్థానిక ఆర్థిక వ్యవస్థను పెంపొందించవచ్చన్నారు.

## మహిళలకు ప్రభుత్వంలో ప్రాధాన్యం

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

కూటమి ప్రభుత్వం మహిళలకు అధిక ప్రాధాన్యం ఇస్తుందని మాజీ మున్సిపల్ చైర్ పర్సన్ పైడి శెట్టి జయంతి అన్నారు. గురువారం స్థానిక అంధవరపు వరహా నరసింహం (వరం) స్కూల్లో నగరంలోని 46, 47 డివిజన్ల డ్వాక్రా సంఘాల సమైఖ్యల జనరల్ బాడీ మీటింగ్‌లో ఆమె మాట్లాడారు. మహిళలు అన్ని రంగాల్లో రాణిస్తున్నారన్నారు. ఇటీవల జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో మహిళలంతా కూటమి ప్రభుత్వానికి మద్దతుగా నిలిచి అఖండ విజయం సాదించడానికి ఎంతో తోడ్పాటు అందించారన్నారు. సీఎం చంద్రబాబు హయాంలోనే డ్వాక్రా సంఘాలు రాష్ట్రంలో ఏర్పాటు అయ్యాయన్నారు. ప్రభుత్వం అమలు చేసే పథకాలను డ్వాక్రా సంఘాలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. రాష్ట్ర అభివృద్ధికి నిరంతరం కృషిచేస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబుకి, కూటమి ప్రభుత్వానికే అండగా నిలిచి భవిష్యత్తురాలకు ఆదర్శంగా నిలవాలని మహిళా సంఘాలకు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో నగర టీడీపీ అధ్యక్షులు మాదారపు వెంకటేష్, నాయకులు అంధవరపు సంతోష్, 46, 47 టీడీపీ డివిజన్ ఇన్‌చార్జ్‌లు కరగాన భాస్కరరావు, కరగాన రామ్మోహన్ యాదవ్, సాయి, మెప్మా సిబ్బంది, డ్వాక్రా మహిళలు పాల్గొన్నారు.



## ప్రమోషన్ల ప్రక్రియలో క్యాచ్ అప్ రూల్ విడనాడాలి

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

ఉత్తరాంధ్ర ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల జేఏసీ రవాణా శాఖలో ప్రమోషన్ జాబితాలో క్యాచ్‌అప్ రూల్ అమలు చేయడం ఎస్సీ, ఎస్టీ అధికారుల ప్రమోషన్లు అన్యాయం చేయడమేనని, ప్రమోషన్ల ప్రక్రియలో క్యాచ్‌అప్ రూల్ విడనాడాలని రాష్ట్ర మాల ఉద్యోగుల సంఘం స్టేట్ కన్వీనర్ నూతులపాటి భరత్‌భూషణ్‌రాజ్, ఎస్సీ,ఎస్టీ టీచర్స్ పెడరేషన్ రాష్ట్ర గౌరవ అధ్యక్షులు పోతల దుర్గారావు, దళిత హక్కుల పరిరక్షణ సమితి శ్రీకాకుళం జిల్లా అధ్యక్షులు అంపోలు ప్రతాప్ డిమాండ్ చేశారు. ఈమేరకు గురువారం వారు విలేకరులతో మాట్లాడుతూ క్యాచ్‌అప్ రూల్ ప్రక్రియ పూర్తిగా రాజ్యాంగ విరుద్ధమన్నారు. రాష్ట్ర అధికారులు ప్రభుత్వం అనుమతి లేకుండా క్యాచ్‌అప్ రూల్ అమలు చేయడాన్ని దళిత హక్కుల పరిరక్షణ సమితి ఎస్సీ ఎస్టీ ఉద్యోగుల ఉత్తరాంధ్ర ఫోరం తరపున తీవ్రంగా ఖండించారు. ఎస్సీ ఎస్టీ ఉద్యోగుల ప్రమోషన్‌లో ఏళ్ల తరబడి ఉన్న సుప్రీంకోర్టు ఉత్తర్వులు జీవోలను తుంగలో తొక్కిన రవాణాశాఖ జోన్-3 అధికారులపై తక్షణమే చర్యలు తీసుకోవాలని, అన్యాయాన్ని సరిదిద్దాలని కోరారు.



## కేంద్ర సాంస్కృతిక పరిశోధన శిక్షణకు దామోదరరావు

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)




న్యూఢిల్లీలోని కేంద్ర సాంస్కృతిక పరిశోధన శిక్షణ సంస్థ దేశంలోని అన్నిరాష్ట్రాల ఉపాధ్యాయులకు నూతన విద్యావిధానం 2020లోని సమగ్రవిద్యపై ఐదురోజుల పాటు ఈనెల 14 నుంచి 18 వరకు శిక్షణ జరుగుతుంది. ఈ శిక్షణలో భాగంగా విద్యార్థులకు 21వ శతాబ్దపు విలువలు, భారతీ సంగీతం, నృత్యం, హస్తకళలు, లింగ సమానత, స్థానిక సంప్రదాయాలు, కథల ద్వారా బోధన, బహుళ భాషలు జోడించి ఉపాధ్యాయులందరూ బోధన చేయాలని శిక్షకులు సూచించారు. పాల్గొన్న 130మంది ఉపాధ్యాయుల్లో మన రాష్ట్రం నుంచి విజయనగరం జిల్లా బొద్దూరు ఉన్నత పాఠశాల మందరాడ ఆంగ్ల ఉపాధ్యాయుడు అదపాక దామోదరరావు, శ్రీకాకుళం జిల్లా బుడుమూరు ఉన్నత పాఠశాల ఉపాధ్యాయుడు పూజారి గోవిందరావు ఉన్నారు. దామోదరరావు ఆంగ్లంలో సొంతంగా రాసి ప్రదర్శన చేసిన దేశభక్తుల రాజు భగత్‌సింగ్ ఏకపాత్ర అందరి ప్రసంశలు పొందింది. ఈ సందర్భంగా మన రాష్ట్ర సాంస్కృతిక గొప్పతనాన్ని వేదికపై వివరించారు.

## యువతకు దిక్సూచి రతన్ టాటా



(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

యువతకు దిక్సూచి రతన్‌టాటా అని శ్రీకాకుళం లయన్స్‌క్లబ్ అధ్యక్షులు, సన్‌రైజ్ హాస్పిటల్స్ అధినేత డాక్టర్ బొడ్డేపల్లి సురేష్ పేర్కొన్నారు. గురువారం సన్‌రైజ్ ఆసుపత్రి ఆవరణలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. పద్మభూషణ్ రతన్‌టాటా మృతితో దేశం ఓమంచి సామాజిక వేత్తను కోల్పోయిందన్నారు. రతన్‌టాటా వ్యాపార, సేవరంగాల్లో తనదైన ముద్రవేశారన్నారు. ఎందరో వ్యాపారవేత్తలకు సామాజిక సేవకులకు రతన్‌టాటా ఆదర్శం అన్నారు. కరోనా వ్యాప్తి వంటి కీలక సమయంలో ఆయన చూపించిన దాతృత్వం అమోఘమన్నారు. విద్య, వైద్య రంగాల్లో తనవంతుగా దేశానికి సేవ చేశారన్నారు. ఎందరో పేదలకు ఉన్నతవిద్యను ఉన్నత వైద్యం అందించడంలో రతన్‌టాటా తనదైన ముద్ర వేశారన్నారు. నేటి సమాజానికి పట్టిపీడిస్తున్న పేదరికం నిరుద్యోగిత వంటి ప్రధాన సమస్యల పరిష్కారంలో భాగంగా తనవంతు కృషి చేసిన వ్యక్తి రతన్ టాటాగా అభివర్ణించారు. కార్యక్రమంలో కళింగ సంక్షేమ సేవాసంఘం జాతీయ గౌరవ అధ్యక్షులు బుడుమూరు శ్రీరామమూర్తి మాట్లాడుతూ రతన్‌టాటా ఎంతో ఉన్న స్థానానికి చేరినప్పటికీ సమాజం పట్ల తనవంతు బాధ్యతను నిర్వర్తించేవారన్నారు. సాటి మనుషులు, జీవుల పట్ల ప్రేమ కలిగి ఉండేవారన్నారు. సమాజానికి తనవంతుగా తిరిగి ఇచ్చిన మహావ్యక్తి రతన్‌టాటాగా ఆయన పేర్కొన్నారు. కె.జి.ఎఫ్.అధ్యక్షులు బి.వి.ఎస్.ఎన్.రాజు మాట్లాడుతూ రతన్ టాటా కేవలం ఒక వ్యక్తి మాత్రమే కాదని ఒక శక్తిగా ఆయన అభివర్ణించారు.

## పురవీధుల్లో ఊరేగిన దుర్గమ్మ

(సత్యంన్యూస్, శ్రీకాకుళంరూరల్)

సింగుపురం గ్రామం పెద్దవీధి వాహనాలశాల వద్ద ఉత్సవ కమిటీ సభ్యులు గ్రామపెద్దల సహాయ సహకారాలతో ఏర్పాటు చేసిన విజయ దుర్గమ్మ నిమజ్జనోత్సవం అంగరంగ వైభవంగా బుధవారం జరిగింది. దసరా శరన్నవరాత్రుల పురస్కరించుకొని తొమ్మిదిరోజుల పాటు గ్రామ పురోహితులు పెంట చిట్టిబాబు శర్మ, పెంట రామకృష్ణ శర్మల అర్చక పర్యవేక్షణలో అమ్మవారికి పూజలు, కుంకుమార్చనలు, వేదోక్తంగా, శాస్త్రోక్తంగా నిర్వహించారు. కోలాట ప్రదర్శన, భజన బృందం, దుర్గామాత నామ సంకీర్తనలు చేస్తూ, డీజే డ్యాన్సులతో, విచిత్ర వేషధారణలతో, సింగుపురం గ్రామ పురవీధుల్లో అంగరంగ వైభవంగా నిమజ్జనోత్సవం ఊరేగింపు సాగింది. సింగుపురం గ్రామ సర్పంచ్ గుండ ఆదిత్య నాయుడు నేతృత్వంలో దుర్గామాత నిమజ్జోత్సవం జరిగిందని గ్రామ పురోహితులు తెలిపారు. కార్యక్రమంలో గ్రామ ప్రజలు, సింగుపురం యూత్‌తోపాటు గ్రామ పెద్దలు పరిసర గ్రామాల ప్రజలు పాల్గొన్నారు.



## బీసీలకు రక్షణ చట్టం చారిత్రిక నిర్ణయం

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)



రాష్ట్రంలో వెనుకబడిన తరగతులు గౌరవప్రదమైన జీవనం అందించడమే లక్ష్యంగా బీసీ రక్షణ చట్టం రూపొందిస్తున్నట్లు రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించడం శుభపరిణామం అని బీసీ సంక్షేమ సంఘం జాతీయ ప్రధాన కార్యదర్శి డాక్టర్ బుడుమూరు రాజేష్ అన్నారు. ఈ మేరకు గురువారం ఒక ప్రకటన విడుదల చేసి ముఖ్యమంత్రి చంద్రబాబుకు ధన్యవాదాలు తెలిపారు. చట్టం రాష్ట్రంలో వెనుకబడిన తరగతులకు రక్షణ కవచంలాంటిదని అభిప్రాయపడ్డారు. గత ఎన్నికల ముందు ఇచ్చిన హామీలకు కట్టుబడుతూ, బీసీ డిక్లరేషన్‌లో పేర్కొన్న అన్ని అంశాలనూ అమలు చెయ్యడం అహోనిస్తున్నామన్నారు. తెలంగాణ ప్రభుత్వం తరహాలో కులగణన చేపట్టి, చట్టసభల్లో బీసీలకు 33శాతం రిజర్వేషన్లు కల్పించాలన్నారు. కులపరంగా, వ్యక్తిగతంగా దూషించిన చర్యలు తీసుకునేలా చట్టంలో బీసీలకు రక్షణ కవచంలా ఉండేలా చర్యలు తీసుకోవాలని సూచనలు చేశారు. ఈ సందర్భంగా బీసీ రక్షణచట్టంపై ప్రత్యేక దృష్టి పెట్టిన రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేష్, సీనియర్ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడుకు బీసీ సంక్షేమ సంఘం తరపున ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

• ఎడిటోరియల్

# నాలుక మడతెట్టేసిన ట్రూడో

కెనడాలో జరిగిన ఖలిస్థానీ తీవ్రవాది హర్దీప్ సింగ్ నిజ్జార్ హత్యకేసును ఇండియాపై నెట్టేసి అంతర్జాతీయ సమాజం ముందు భారత్‌ను దోషిగా నిలబెట్టాలనుకున్న కెనడా ఆరోపణల్లో పస లేదని తేలిపోయింది. సరిగ్గా మూడు రోజుల్లోనే కెనడా ప్రధాని ట్రూడో మాట మార్చేయడంతో సరైన ఆధారాలు లేవనే విషయం ఇప్పుడు తేటతెల్లమైంది. భారత్‌ను అంతర్జాతీయ సమాజం ముందు దోషిగా చూపెడుతూ ఒత్తిడి పెంచేందుకు కెనడా ప్రయత్నించడం, అందుకు యూఎస్, యూకే లాంటి దేశాలు సన్నాయినొక్కులు నొక్కడంతో భారత్ ఈ సవాల్‌ను ఎలా స్వీకరిస్తుందోనన్న ఆసక్తి అంతర్జాతీయంగా నెలకొంది. కానీ విషాదమేమిటంటే.. తాను చేసిన ఆరోపణలనే ఆధారసహితంగా నిరూపించలేమని ఏకంగా కెనడా ప్రధానే నొక్కివక్కాణించడం. దానికి మద్దతు తెలిపే ప్రాశ్చాత్య దేశాల గూడుపుఠాణీ ఇప్పుడు అదే అంతర్జాతీయ సమాజం ముందు హాస్యాస్పదమైంది. కేవలం కెనడా ఇంటెలిజెన్స్ రిపోర్ట్స్ రాయల్ కెనడియన్ మౌంటెడ్ పోలీస్ ఇచ్చిన ప్రాథమిక నివేదిక ఆధారంగా ఆరోపణలు గుప్పించినట్లు స్వయాన కెనడా ప్రధానే చెప్పడంతో కెనడా పరువే అంతర్జాతీయ సమాజం ముందు అట్లాంటిక్ సముద్రంలో కలిసిపోయింది. ఇండియాను టార్గెట్ చేయాలనుకొని బొక్కబోర్లా పడిన కెనడాకు నిషేధిత సిక్ ఫర్ జస్టిస్ నాయకుడు, ఖలిస్థానీ తీవ్రవాది గుర్‌పత్వంత్ సింగ్ పన్నూ గత మూడేళ్లుగా తాను ట్రూడో కార్యాలయంతో టచ్‌లో ఉన్నట్లు వెల్లడించడం, ఎప్పటికప్పుడు సమాచారాన్ని ఇచ్చిపుచ్చుకుంటున్నట్లు తెలపడంతో కెనడా ఆడుతున్న నాటకాలన్నీ బట్టబయలైపోయాయి. దీంతో భారత దౌత్యవేత్తలపై కెనడా చేసిన ఆరోపణలన్నీ నిరాధారమైనవని, ఆధారాలుంటే చూపాలంటూ భారత్ విసిరిన ప్రతిసవాల్‌కు కెనడా ప్రధాని మాట మారుస్తూ చేసిన వ్యాఖ్యలే ఆ దేశపు లేకితనాన్ని బయటపెట్టాయి. ఖలిస్థానీ వేర్పాటువాదులను ప్రోత్సహిస్తూ ఉగ్రవాదాన్ని పెంపొందించేందుకు కెనడా ప్రయత్నిస్తోందంటూ భారత విదేశీ మంత్రిత్వశాఖ కౌంటర్ అటాక్‌తో ఇంతవరకు భారత్‌పై దాడికి దిగిన కెనడా ఇప్పుడు డిఫెన్స్‌లో పడిపోయింది. హర్దీప్ సింగ్ నిజ్జర్ మర్డర్ కేసులో భారత ప్రభుత్వ జోక్యాన్ని బట్టబయలు చేసే సాక్ష్యాలను బయటపెట్టడంలో కెనడా విఫలమైందని, అవి నిరాధారమైనవని తేటతెల్లమయ్యాయంటూ ఇప్పుడు కెనడాను ఇండియా కార్నర్ చేయడంతో కెనడా నాటకం కాస్త బూమరాంగ్ అయింది. ఒకానొక దశలో కెనెడియన్లపై దాడి చేసేందుకు భారత దౌత్యవేత్తలు సమాచారాన్ని సేకరిస్తూ, దాన్ని వ్యవస్థీకృత నేరగాళ్లకు అందజేస్తున్నారనేది కెనడా ప్రధాని జస్టిన్ ట్రూడో చేసిన ప్రధాన ఆరోపణ. పైగా భారత్ తప్పు చేస్తోందని, తమ గడ్డపై తమ పౌరులను చంపుతామంటే చూస్తూ ఊరుకునే ప్రసక్తి లేదంటూ ట్రూడో మాట్లాడటం, నిజ్జర్ హత్యలో భారత్ ప్రభుత్వ ప్రమేయం ఉందన్న ప్రచారాన్ని భుజాలకెత్తుకోవడంతో ఈ రెండు దేశాల మధ్య నాలుగు రోజుల క్రితం వరకు పచ్చగడ్డి వేస్తే భగ్గుమనే వాతావరణం ఏర్పడింది. ఇవన్నీ జియో పాలిటిక్స్‌లో భాగమే. పరిమళాలు వెదజల్లాల్సిన భారత్-కెనడా ద్వైపాక్షిక సంబంధాల్లో సిక్కుల వేర్పాటువాదం, ఖలిస్థానీ ఉద్యమాలు దశాబ్దాల నుంచి ముల్లులా గుచ్చుకుంటునే ఉన్నాయి. 1980ల్లో సిక్కులపై భారత భద్రతాదళాల దాడులు, ఊచకోతే అందుకు ప్రధాన కారణంగా చెబుతుంటారు. ఆ సమయంలో పెద్ద ఎత్తున సిక్కులు కెనడాకు వలసవెళ్లి సెటిలయ్యారు. ఇప్పుడు అక్కడ సిక్కు సంఘాలు కూడా పెద్ద సంఖ్యలోనే వేళ్లూనుకొని ఉన్నాయి. ఓటుబ్యాంకు రాజకీయాల్లో కూడా కీలకంగా మారాయి. ఇలాంటి పరిస్థితుల్లో 1985లో కెనడాలోని మాంట్రియల్ నుంచి ముంబైకి రావాల్సిన ఎయిర్ ఇండియా విమానాన్ని సిక్కు తిరుగుబాటుదారులు పేల్చడంతో ఆ విమానం అట్లాంటిక్ మహాసముద్రంలో కుప్ప కూలింది. ఆ ఘోర ఘటనలో 329 మంది మృత్యువాతపడితే, ఎక్కువమంది అందులో కెనడా పౌరులే అన్న సంగతి గమనించాలి. ఇప్పుడు కెనడా ఎన్నికలు ముంచుకొస్తున్న తరుణంలో సిక్కులు అధికంగా ఉండేచోట లబ్ధి పొందేందుకు ఇదంతా జస్టిన్ ట్రూడో ఆడుతున్న నాటకంగా భారత్ కొట్టిపారేస్తోంది. అదే సమయంలో కెనడాకు టిట్ ఫర్ టాట్ ఎలా చేయాలనే యోచనలో కూడా ఉంది. 2023లో ఓ సిక్కు వేర్పాటువాద నాయకుడి హత్యలో భారత్ కుట్ర ఉందనే అభియోగాలు మోపిన కెనడా అందులోకి లారెన్స్ బిష్ణోయ్ అనే గ్యాంగ్‌స్టర్‌ను లాగింది. డ్రగ్స్ అక్రమ రవాణా కేసులో ఏటీఎస్ పోలీసుల చేతిలో అరెస్టయి ప్రస్తుతం లారెన్స్ బిష్ణోయ్ గుజరాత్ జైలుఊచలు లెక్కించడాన్ని కెనడా తనకు అనుకూలంగా మార్చుకునేందుకు ప్రయత్నించింది. గుజరాత్ ప్రధాని నరేంద్రమోడీ సొంత రాష్ట్రం కావడం, అక్కడ మళ్లీ బీజేపీ ప్రభుత్వమే కొలువుతీరడం, అహ్మదాబాద్ శబర్మతీ జైలులో బిష్ణోయ్ ఖైదు కావడంతో వీటన్నిటికీ ముడిపెడుతూ కెనడాలో నరేంద్రమోడీ కుట్రకు పాల్పడుతున్నారని అభియోగాలు మోపి అభాసుపాలయింది.



# 20సార్లు చావు నుంచి బయటపడి..!

## జమ్మూకాశ్మీర్‌లో ఏకైక మహిళా మంత్రిగా సకీనా ఈటూ

ఎట్టకేలకు జమ్మూ కాశ్మీర్‌లో ప్రభుత్వం ఏర్పడింది. ఇటీవల జరిగిన జమ్మూ కాశ్మీర్ అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ – నేషనల్ కాన్ఫరెన్స్ కూటమి ఘన విజయం సాధించగా.. తాజాగా ముఖ్యమంత్రిగా ఎన్‌సీ నేత ఒమర్ అబ్దుల్లా ప్రమాణ స్వీకారం చేశారు. సీఎంతో పాటు డిప్యూటీ సీఎం సహా నలుగురు మంత్రులుగా ప్రమాణ స్వీకారం చేశారు. అయితే వీరిలో ఏకైక మహిళా మంత్రిగా సకీనా ఈటూ ప్రమాణం చేశారు. రాజకీయ కుటుంబ నేపథ్యం కలిగిన సకీనా ఈటూ తండ్రి, సోదరుడు కూడా రాజకీయాల్లో ఉండేవారు. ఆమె తండ్రి, సోదరుడిని ఉగ్రవాదులు చంపేయగా, సకీనా ఈటూ 20సార్లు హత్యాయత్నాల నుంచి బయటపడ్డారు. గతంలోనూ మంత్రిగా పనిచేసిన సకీనా ఈటూ.. తాజాగా మరోసారి ఒమర్ అబ్దుల్లా కేబినెట్‌లో స్థానం దక్కించుకున్న ఏకైక మహిళగా నిలిచారు.

దక్షిణ కాశ్మీర్‌లోని కుల్గామ్ జిల్లా డీహెజ్ పోరా అసెంబ్లీ నియోజకవర్గం నుంచి సకీనా ఈటూ ఇటీవలి ఎన్నికల్లో ఎమ్మెల్యేగా గెలిచారు. మెహబూబా ముఫ్తీకి చెందిన పీపుల్స్ డెమోక్రాటిక్ పార్టీ అభ్యర్థి గుల్జార్ అహ్మద్ దర్‌పై 17,449 ఓట్ల భారీ మెజార్టీతో విజయం సాధించారు. రాజకీయ కుటుంబం నుంచి వచ్చిన సకీనా ఈటూ.. నేషనల్ కాన్ఫరెన్స్ పార్టీలో పలు హోదాల్లో పనిచేశారు. సకీనా ఈటూ తండ్రి వలీ మోహమ్మద్ ఈటూ గతంలో జమ్మూ కాశ్మీర్ అసెంబ్లీ స్పీకర్‌గా పనిచేశారు. అయితే ఆయన 1994లో హత్యకు గురయ్యారు. ఆ తర్వాత సకీనా ఈటూ సోదరుడు రాజకీయాల్లోకి రాగా, అతడ్ని 2001లో ఉగ్రవాదులు హత్య చేశారు.

ఆ సమయంలో మెడిసిన్ చదువుతున్న సకీనా ఈటూ రాజకీయాల్లోకి అడుగుపెట్టారు. ఈ క్రమంలోనే సకీనా ఈటూపై 20 సార్లకు పైగా హత్యాయత్నాలు జరిగినా ప్రాణాలతో ఆమె బయటపడ్డారు. ఈ క్రమంలోనే గతంలో జమ్మూ కాశ్మీర్ లెజిస్లేటివ్ కౌన్సిల్‌లో ప్రతిపక్ష నేతగా బాధ్యతలు నిర్వర్తించారు. అంతేకాకుండా పర్యాటక శాఖ, విద్యాశాఖ సహాయ మంత్రిగా పనిచేశారు. 2008 నుంచి 2014 వరకు జమ్మూ కాశ్మీర్ సోషల్ వెల్ఫేర్ శాఖ మంత్రిగా ఉన్నారు. 53 ఏళ్ల సకీనా ఈటూ తాజాగా ఒమర్ అబ్దుల్లా కేబినెట్‌లో మంత్రిగా ప్రమాణ స్వీకారం చేశారు. జమ్మూ కాశ్మీర్ ప్రజల్లో మంచి ఆదరణ ఉన్న అతి కొద్దిమంది మహిళా నేతల్లో సకీనా ఈటూ ఒకరు కావడం గమనార్హం.

మరోవైపు.. జమ్ములోని నౌషెరా అసెంబ్లీ సీటు నుంచి ఎన్నికైన సురిందర్ చౌధరీని ఒమర్ అబ్దుల్లా డిప్యూటీ సీఎంగా నియమించారు. జమ్ము ప్రజల గళాన్ని శాసనసభలో వినిపించేందుకు సురిందర్ చౌదరీకి డిప్యూటీ సీఎం పదవిని కట్టబెట్టినట్లు ముఖ్యమంత్రి ఒమర్ అబ్దుల్లా తెలిపారు. తన ప్రభుత్వంలో జమ్మూ ప్రజలకు ప్రాతినిధ్యం లేదని వారు బాధపడాల్సిన అవసరం లేకుండా జమ్మూ ప్రాంతం నుంచి గెలిచిన వ్యక్తికి ఉప ముఖ్యమంత్రి పదవిని ఇచ్చినట్లు ఒమర్ అబ్దుల్లా స్పష్టం చేశారు.

- శివరామచారి తాటికొండ

# గౌరీ, నందీశ్వరుల ఊరేగింపు



(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

ఆశ్వయుజ మాసంలో వచ్చే పౌర్ణమి రోజున జరుపుకొనే గౌరీ పౌర్ణమి ఉత్సవాలు నగరంలోని కొన్నావీధిలో బుధవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. సకల సౌభాగ్యాలు, సిరిసంపదలు, సత్సంతానము ప్రసాదించే గౌరీదేవిని, నందీశ్వ రుని స్థానిక పెద్దలు, యువకులు, మహిళలు, పిల్లలు అంతా కలిసి బుధవారం రాత్రి ఊరేగింపు నిర్వహించారు. గౌరీ నందీశ్వరుల ఉత్సవాలు తొమ్మిది రోజుల పాటు నిర్వహిస్తున్నట్టు స్థానిక పెద్దలు తెలిపారు. రాత్రి సమయంలో పౌర్ణమి ఉండేటప్పుడే గౌరీ, నందీ శ్వరులను ఊరేగింపు నిర్వహించడం ఆనవాయితీ అన్నారు. కాగా తొమ్మిది రోజులపాటు గౌరీదేవికి పప్పన్నం, కలగూర, నందీశ్వరు నికి పెసలు తయారుచేసిన గుగ్గిందలు, గోధుమ పిండి అట్టు ప్రసాదంగా పెడతామని స్థానిక పెద్దలు తెలిపారు. పంటలు బాగా పండాలని గౌరీదేవిని పూజిస్తారు. మగపిల్లలు కలగనివారు నందీశ్వరుడ్ని ఎత్తుకుంటే మగపిల్లలు పుడతారని భక్తుల నమ్మకం. ఆ నమ్మకం కొద్దీ మొక్కుకున్నవారు పిండిదీపాలు, అరటిగెలలు కడతారు. కొన్నావీధి పురజనుల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న గౌరీనందీశ్వరుల నవరాత్రి ఉత్సవాల సందర్భంగా బుధవారం రాత్రి జరిపిన ఊరేగింపులో మాజీ కౌన్సిలర్ బలగ పండరీనాథ్, టీడీపీ నాయకుడు బలగ ప్రసాద్, బలగ మన్మధరావు, బారకల శ్రీనివాసరావు, లింగిభేరి శ్రీనివాసరావు, తామరాపల్లి శ్రీనివాసరావు, ఎల్.హరి, గొడుగోటి సుజాత, బారకల రమణమ్మ, పిరగడ నారాయణమ్మ, బలగ సంధ్యారాణి, శ్యామలతో పాటు పెద్ద సంఖ్యలో మహిళలు, పెద్దలు, పిల్లలు పాల్గొన్నారు.

## సీపీఎం జిల్లా మహాసభలు జయప్రదం చేయండి



(సత్యంన్యూస్, శ్రీకాకుళం అర్బన్)

సీపీఎం పార్టీ జిల్లా మహాసభలను జయప్రదం చేయాలని పార్టీ జిల్లా కార్యదర్శి డి.గోవిందరావు, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు బి.కృష్ణమూర్తి పిలుపునిచ్చారు. స్థానిక సీపీఎం కార్యాలయంలో గురువారం వారు మాట్లాడుతూ జిల్లా మహాసభలు నవంబరు 9, 10 తేదీల్లో పలాసలో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. 9న ర్యాలీ, బహిరంగ సభ ఉంటుందని, ఈ సభలో రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు, రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు బి.తులసీదాసు ప్రసంగిస్తారని వారు తెలిపారు.






అక్కడ కూడా మన డామినేషన్ అంటావేంట్రా.. అదుర్స్ లో బ్రహ్మానందం చెప్పిన ఈ డైలాగ్.. ఇప్పుడు టాలీవుడ్ హీరోలకు సరిగ్గా సరిపోతుంది . ఎందుకంటే, సాధారణంగా కథలో కంటెంట్ ఉంటే.. ఆడియన్స్ ఆ మూవీని నెక్స్ట్ లెవెల్‌కు తీసుకుని వెళ్తారు. అలాగే ఆ కంటెంట్‌ను కరెక్ట్‌గా ఎలివేట్ చేయాలంటే సరైన కట్ అవుట్ ఉండి తీరాల్సిందే. అలాంటి కట్ ఔట్స్ కేవలం టాలీవుడ్ లోనే ఉన్నాయి. ఇప్పుడు టాలీవుడ్ హీరోలు బాలీవుడ్ ను ఏలేస్తున్నారు. ఇప్పటికే అక్కడ అనేక తెలుగు సినిమాలు మంచి వసూళ్లను అందుకున్నాయి. దాదాపు బాలీవుడ్ గడ్డపై తెలుగు జెండా పాతినట్లే. పైగా బాలీవుడ్ హీరోలు చేయలేని పని కూడా పాన్ ఇండియా స్టార్స్ చేస్తున్నారు. అక్కడ మూతపడిన ఎన్నో థియేటర్స్ కు.. తమ సినిమాలతో ప్రాణం పోశారు. చూడబోతుంటే బాలీవుడ్‌పై దండయాత్ర ఇప్పట్లో ఆగేలా లేదు.

# అక్కడా మన డామినేషనే!

ఒకప్పుడు ఇండియన్ మూవీస్ లో బాలీవుడ్ దే పై చేయి. కానీ ఇప్పుడు అలా లేదు.. ఖాన్ లు కపూర్ ల దగ్గర నుంచి బీ టౌన్‌లో ఉన్న బడా హీరోలంతా కామ్ అయిపోయారు. 2023 లో జవాన్, పఠాన్, గద్దర్ 2 లాంటి సినిమాలు బీ టౌన్ ను రఫ్ ఆడించా యి. ఇక ఆ తర్వాత ఆ రేంజ్ లో చెప్పుకోదగిన సినిమాలు అంటే 2024 లో వచ్చిన స్త్రీ-2 సినిమానే. నెక్స్ట్ బాలీవుడ్ బాక్స్ ఆఫీస్‌ను గట్టెక్కించిన సినిమాలు ఏమైనా ఉన్నాయంటే అది హనుమాన్, కల్కి, దేవర లాంటి సినిమాలే.

ఫ్యూచర్ లో కూడా బాలీవుడ్ నుంచి సౌండ్ చేసే సినిమాలు పెద్దగా ఏమి లేవు. సల్మాన్‌ఖాన్ నుంచి సికిందర్ సినిమా ఉన్నా కూడా.. అంతా బజ్ వినిపించడంలేదు. వార్ 2 సినిమా పర్లేదు అనిపించుకుంటుంది. కానీ అందులో యంగ్ టైగర్ ఎన్టీఆర్ ఉండనే ఉన్నాడు. ఇలా చూసినట్లయితే టాలీవుడ్ హీరోల హవానే నడుస్తుంది. ఇప్పటివరకు ప్రభాస్, తారక్ తమ సినిమాలతో రూల్ చేశారు. ఇక ఇప్పుడు బన్నీ, చరణ్ వంతుగా పుష్ప-2, గేమ్‌చేంజర్‌తో బాలీవుడ్‌ను కుదిపేసేందుకు సిద్ధమవుతున్నారు. ఈ సినిమాలు కాకుండా సందీప్ రెడ్డి వంగ-ప్రభాస్ కాంబోలో ఓ మూవీ, ప్రశాంత్ నీల్-తారక్ కాంబోలో ఓ మూవీ, హను రాఘవపూడి-ప్రభాస్ కాంబోలో ఓ మూవీ, జక్కన్న- మహేష్ కాంబోలో ఓ మూవీ.. ఇలా చెప్పుకుంటూపోతే టాలీవుడ్ నుంచి రాబోయే పాన్ ఇండియా చిత్రాల లిస్ట్ చాలానే ఉంది. సో బాలీవుడ్ పై టాలీవుడ్ హీరోల దండయాత్ర ఇప్పట్లో ఆగదు. - ఐడ్రీమ్‌పోస్ట్.కామ్ సౌజన్యంతో..

డిసెంబర్ 6న పుష్ప-2 సినిమా రిలీజ్ కు సిద్ధంగా ఉంది. ఈ మూవీ మొదటి పార్ట్ కు వచ్చిన రెస్పాన్స్ తెలియనిది కాదు. ఇక ఇప్పుడు పార్ట్ 2 అంతకు మించి ఉండబోతుంది. ఆ తర్వా త ఈ దండయాత్రను కొనసాగించడానికి చరణ్ లైన్‌లో ఉన్నాడు. సంక్రాంతికి రామ్ చరణ్ గేమ్ ఛేంజర్ మూవీ రిలీజ్ కాబోతుంది. రెబెల్ స్టార్ , యంగ్ టైగర్‌లా .. ఐకాన్ స్టార్, గ్లోబల్ స్టార్ కూడా బాలీవుడ్ ను ఒక ఊపు ఊపేయడం ఖాయం.



భారతదేశ ఎన్నికల కమిషన్ రోజురోజుకూ నిస్సిగ్గుతో ప్రవర్తిస్తున్నట్టుగా కనిపిస్తోంది. ఎన్నికల ముందు ఇవిఎంలకు పెట్టిన ఛార్జింగ్ పోలింగ్ తర్వాత కొన్ని చోట్ల వంద శాతంగా కనిపించడంతో అందరిలోనూ అనుమానాలు రేకెత్తిస్తున్నాయి. పోలింగ్ ముగిసేనాటికి ప్రకటించిన ఓటు శాతం తెల్లవారే సరికి సవరించి ప్రకటించిన ఓటు శాతం ప్రజాస్వామికవాదులను బెంబేలెత్తిస్తోంది. సగటు ఓటరుకు ఉన్న అనుమానాలను తీర్చవలసిన ఎన్నికల కమిషన్ మరిన్ని అనుమానాలకు తావిచ్చేటట్టు ప్రవర్తించడం ప్రజాస్వామ్యానికి ప్రమాదమని దుప్పల రవికుమార్ అంటున్నారు.

# ప్రమాదంలో ప్రజాస్వామ్యం




నెల రోజుల కిందట జరగవలసిన మహారాష్ట్ర ఎన్నికల షెడ్యూల్‌ను చాలా ముందుచూపుతో ఎన్నికల కమిషన్ వాయిదా వేసింది. ఈ దేశంలో పండగలకు కరువన్నట్టు, పండగ వల్లనే ఎన్నికలను వాయిదా వేసినట్టు ప్రకటించడం సిగ్గుచేటు. అసలు కిందటి నెలలో హర్యానాలో, జమ్ము కశ్మీర్‌లో ఎన్నికలు జరిపించిన తీరుతోనే అనేక అనుమానాలు అందరిలోనూ కలిగిన మాట వాస్తవం. ఎన్నికల పొత్తులు పరిశీలించినా, వరుసగా రెండుసార్లు పాలించిన భారతీయ జనతా పార్టీపైన యాంటీ ఇన్‌కంబెన్సీని దృష్టిలో పెట్టుకున్నా, ఎగ్జిట్ పోల్స్ సరళిని పరిశీలించినా కాంగ్రెస్ గెలుపు, బీజేపీ ఓటమి తథ్యమని ఈ దేశంలోని ప్రతి సెఫాలజిస్టు నమ్మాడు. పైగా వివిధ పత్రికలలో, టివి చానెళ్లలో ఇదే అభిప్రాయం కనిపించింది. ఆఖరికి మోడీ అనుకూల మీడియా సైతం బీజేపీ గెలుపు పట్ల సందేహాలు వ్యక్తపరిచింది. ఫలితాలు వెలువడిన తర్వాత అర్ణబ్ గోస్వామి సైతం బీజేపీ ఆకస్మిక విజయం పట్ల తన విస్మయాన్ని దాచుకోలేకపోయాడు. ఆంధ్రప్రదేశ్‌తో సహా వివిధ రాష్ట్రాలలో ఎన్నికల ఫలితాల పట్ల ఇదే తరహా అనుమానాలు పలు పార్టీలు వ్యక్తపరిచినప్పటికీ, దేశంలో ప్రధాన ప్రతిపక్షమైన భారత జాతీయ కాంగ్రెస్ పార్టీ పెద్దగా ప్రతిస్పందించ లేదు. హర్యానాలో వెలువడిన ఫలితాలతో కాంగ్రెస్ పార్టీ ఖంగుతిన్నది. వెంటనే ఎన్నికలు ఇవిఎంల ద్వారా జరిగిన తీరుపై సందేహాలు వ్యక్తం చేస్తూ తమ గళం వినిపించారు.

## సుదీర్ఘంగా సాగిన మీడియా సమావేశం

ఇలా రేగిన దుమ్ము ఇంకా సద్దుమణగక ముందే మంగళవారం దేశ రాజధానిలో భారత ఎన్నికల కమిషనర్ రాజీవ్‌కుమార్ మీడియా ముందుకు వచ్చి తన వ్యాఖ్యలతో ఈ అగ్నికి మరింత అజ్యం పోసారు. మహారాష్ట్రలో ఒకే దశలో అసెంబ్లీ ఎన్నికలు జరుగుతాయని, జార్ఖండ్‌లో రెండు దశలలో అసెంబ్లీ ఎన్నికలు జరుగుతాయని చెప్పారు. 288 స్థానాలున్న మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికలు నవంబర్ 20న ఒకే దశలో జరుగుతాయని, 82 స్థానాలున్న జార్ఖండ్ శాసనసభ ఎన్నికలు మాత్రం రెండు దశలలో (మొదటి దశ నవంబర్ 13వ తేదీన, రెండవ దశ ఎన్నికలు నవంబర్ 20వ తేదీన) జరుగుతాయని, రెండింటి ఫలితాలు మాత్రం నవంబర్ 23న వెలువరిస్తామని ప్రకటించారు. జమ్ము కశ్మీర్‌లో పలు దశల ఎన్నికలు జరపడానికి ఆయన చెప్పిన కారణాలు విని సరేననుకున్న సగటు ఓటరు మాత్రం ఈసారి చెప్పిన కుంటిసాకులు విని పెదవి చప్పరించాడు. మొన్న జరిగిన పార్లమెంటు ఎన్నికలలో మహారాష్ట్రలో ఓటరు టర్నవుట్ చాలా తక్కువస్థాయిలో ఉందని, పెద్ద ఎత్తున ఓటర్లు తరలిరావడానికి పెద్ద ఎత్తున కృషి చేస్తున్నట్టు ఆయన అనడం ఆశ్చర్యం కలిగించింది. మహారాష్ట్రలో కళ్యాణ్, పూణె, థానె, ఉత్తర ముంబయి, దక్షిణ మధ్య ముంబయి, దక్షిణ ముంబయి శాసనసభ నియోజక వర్గాలలో భారీగా పడిపోతున్న ఓటింగ్‌ను పెంచడానికి అవగాహన కార్యక్రమాలు చేపట్టనున్నట్టు ఆయన చెప్పారు. ఈ నియోజక వర్గాలలో గ్రామీణ ఓటర్లు ముందుకొచ్చినంత స్థాయిలో పట్టణ ఓటర్లు ముందుకు రావడం లేదని ఆయన వాపోయారు.

మహారాష్ట్రలో కట్కారి, కోలం, మారియా గోండులైన మూడు గిరిజన తెగలకు చెందిన సుమారు 2.77 లక్షల ఓటర్లు ముందుకు వచ్చి ఓటు వేసేవిధంగా, జార్ఖండ్‌కు చెందిన ఆసుర్, బిర్హోర్, మల్పాదియా, పహాదియా, సౌర్య పహాదియా, బిరాజియా, కోర్వా, సర్వాలైన ఏడు గిరిజన తెగలకు చెందిన సుమారు 1.78 లక్షల ఓటర్లను ఓటింగుకు సన్నద్ధం చేస్తున్నట్టు ఆయన తెలిపారు. దీంతోపాటు జిల్లా ఎన్నికల అధికారులను పనిలో పనిగా హెచ్చరించారు. ఆంధ్రప్రదేశ్, తెలంగాణలలో మాదిరిగా ఎన్నికల సమయంలో డబ్బు, మద్యం అక్రమ రవాణాలను సమర్థంగా అరికట్టాలని తెలిపారు. ఇవన్నీ వందల సందేహాలకు తావిచ్చే విధంగా ఉండడం విషాదం. ఎన్నికల కమిషన్ వ్యవహార సరళిపై ఇప్పటికే రాజకీయ పార్టీలతో పాటు చాలా సంస్థలు, వ్యక్తులు విడివిడిగా కేసులు దాఖలు చేసాయి. కోర్టుల గడపలకు ఎక్కుతున్నాయి. వీటిని అసలు కేసులుగానే ఎన్నికల కమిషన్ పరిగణించడం లేదు. ఇప్పటిదాకా తమకు కేవలం 20 ఫిర్యాదులు మాత్రమే వచ్చాయని, వాటిని ఆమూలాగ్రం పరిశీలిస్తున్నామని చెప్పారు.

## ఫిర్యాదులను పట్టించుకోని కమిషన్

ఇవిఎంల విశ్వసనీయత గురించి పాత్రికేయులు ప్రశ్నించినపుడు అవి చాలా సురక్షితమని, అద్భుతమని రాజీవ్‌కుమార్ కితాబిచ్చుకున్నారు. అసలు ఇవిఎంలకు ప్రత్యామ్నాయం అన్న ఆలోచనకే తావులేదని, ఇవిఎం అక్రమాలు జరిగే వీలులేదని కొట్టిపారేస్తున్నారు. మరి పోలింగ్‌కు పదిరోజుల ముందు పెట్టిన ఛార్జింగ్, కౌంటింగ్ తర్వాత కూడా ఇవిఎం, వివి పాట్‌లకు వందశాతం ఉండడం ఎలా సాధ్యమన్న ప్రశ్నను ఆయన పట్టించుకోవడం లేదు. వివి ప్యాట్ స్లిప్పులు పోలింగ్ కేంద్రాలలో కనిపించడం ఏమిటని ప్రశ్నిస్తే సమాధానం లేదు. సాంప్లింగ్ కాకుండా అన్ని వివి పాట్లను లెక్కించవలసిందే అంటే మౌనమే సమాధానం. ఈ దేశ పౌరులకు వచ్చిన సందేహాలను తీర్చవలసింది పోయి, వాటిని కొట్టిపారేయడం ప్రజాస్వామిక వాదులను విస్తు గొలుపుతోంది. వివిధ రాజకీయ పక్షాల, స్వతంత్ర సంస్థల వ్యతిరేకతను పట్టించుకోకుండా, ఒకవైపు నరేంద్రమోదీ నేతృత్వంలో భారత ప్రభుత్వం జమిలి ఎన్నికలకు సిద్ధమవుతుండడం, అదే సమయంలో ఎన్నికలలో కీలక పాత్ర పోషిస్తోన్న ఇవిఎంలపై ముసురుకుంటున్న సందేహాలను నివృత్తి చేయకపోవడం ఆశ్చర్యకరంగా ఉంది. న్యాయవ్యవస్థపై ఇప్పటికే ప్రజలలో అనేక అనుమానాలు కలుగుతున్నాయి. ప్రజాస్వామ్యానికి నాలుగో స్తంభంగా గుర్తించే జర్నలిజంలో ఇప్పటికే మోదీ ప్రభావం చాలా లోతుగా ఉండడం మనకు తెలిసిందే. ఈ సమయంలో ఎన్నికల కమిషన్ స్వతంత్రంగా వ్యవహరించకుండా, ప్రభుత్వ అడుగులకు మడుగులొత్తడం ఆందోళన కలిగిస్తోంది.




పైకి పెద్దగా కనిపించనప్పటికీ ప్రతిపక్షాలను చావుదెబ్బ కొట్టే ఎన్నికల కమిషన్ నిర్ణయాలలో మనం ప్రత్యేకంగా చెప్పుకోవాల్సింది ఎన్నికల గుర్తుల కేటాయింపులు. గత పార్లమెంటు ఎన్నికలలో శరద్‌పవార్ ఎన్సీపీ పార్టీలో చీలిక వచ్చింది. శరద్‌పవార్ వర్గానికి చివరి నిమిషంలో 'బూరా ఊదుతున్న మనిషి' బొమ్మను కేటాయించారు. ఆ పార్టీ తమ కొత్త గుర్తును సమర్థంగా ప్రజల వద్దకు తీసుకు వెళ్లలేకపోయింది. దీనికి తోడు చాలామంది స్వతంత్ర అభ్యర్థులకు 'బూరా' బొమ్మను కేటాయించారు. దానితో గ్రామీణ ప్రాంత ఓటర్లు గందరగోళానికి గురయ్యారు. ఈ విషయాన్ని పాత్రికేయులు ప్రస్తావించినప్పుడు ఎన్నికల కమిషనర్ ఆ రెండూ విడివిడి గుర్తులని, గందరగోళం ఏమీ లేదని చాలా సులువుగా కొట్టిపారేసారు. విచిత్రం ఏమంటే ఎన్నికల కమిషన్ ఒంటెత్తు పోకడలపై పోరాటం చేయవలసిన రాజకీయ పార్టీలు మౌనం పాటిస్తున్నాయి. డబ్బు, మద్యం, ప్రజాకర్షక పథకాలు తమను గట్టెక్కిస్తాయని ఎవరికి వారే ఎన్నికల యుద్ధానికి సిద్ధమవుతున్నారు. పేజర్లను బాంబులుగా వాడటం సాధ్యం అయినపుడు ఇవిఎం హ్యాకింగ్ ఎందుకు సాధ్యం కాదని కోర్టులను ప్రశ్నించలేకపోతున్నాయి. ప్రపంచంలో అభివృద్ధి చెందిన దేశాలేవీ ఇవిఎంలను నమ్మకుండా బ్యాలెట్ పేపర్లతోనే ఎన్నికలు జరుపుకొంటున్నాయి. వాటికి లేని ఆడంబరం మనకు మాత్రం ఎందుకని మన రాజకీయ పార్టీలు ప్రశ్నించకుండా ఉండడం ప్రజాస్వామ్యానికి పెను ప్రమాదం.

# కళ్లు తెరిచిన న్యాయ దేవత..!

## విగ్రహంలో మార్పులు, తలపై కిరీటం, కత్తి స్థానంలో రాజ్యాంగం

ఇక నుంచి చట్టానికీ కళ్లుంటాయ్. న్యాయదేవత ఇప్పుడు కళ్లు తెరిచింది. అదేంటీ అనుకుంటున్నారా.. కోర్టుల్లో ఉండే న్యాయదేవత విగ్రహానికి ప్రస్తుతం కొత్తగా మార్పులు చేశారు. కళ్లకు ఉన్న గంతలను తొలగించారు. చేతిలో ఉండే కత్తి స్థానంలో రాజ్యాంగం పుస్తకాన్ని ఉంచారు. ఇక తలపై కిరీటాన్ని కూడా పెట్టారు. ఇంతకీ ఈ మార్పులు ఎందుకు చేశారు. అసలు ఈ విగ్రహాన్ని ఎక్కడ ఉంచారు. అనే విషయాలు ఈ స్టోరీలో తెలుసుకుందాం.



మన దేశంలోని ప్రతీ కోర్టులో న్యాయదేవత విగ్రహం ఉంటుంది. చిన్న స్థాయి కోర్టు నుంచి మొదలుకుని దేశ అత్యున్నత న్యాయస్థానం అయిన సుప్రీంకోర్టులో ఈ న్యాయ దేవత విగ్రహాన్ని ఉంచుతారు. అయితే ఎప్పటి నుంచో ఆ న్యాయదేవత విగ్రహం అనగానే మనకు కొన్ని గుర్తులు గుర్తుకువస్తాయి. ఎప్పుడూ న్యాయ దేవత కళ్లకు నల్లటి వస్త్రం కట్టి ఉంటుంది. ఇక ఎడమ చేతిలో ఒక కత్తి, కుడి చేతిలో ఒక త్రాసు కనిపిస్తూ ఉంటాయి. గత కొన్ని దశాబ్దాలుగా న్యాయదేవత అంటే మనకు ఇవే గుర్తుకు వస్తాయి. కానీ ఇక నుంచి న్యాయదేవత పూర్తిగా మారిపోయింది.

భారత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డీవై చంద్రచూడ్ ఆదేశాలతో సుప్రీంకోర్టులో కొత్త న్యాయ దేవత విగ్రహాన్ని ఏర్పాటు చేశారు. అయితే ఇప్పటివరకు ఉన్న న్యాయ దేవత విగ్రహాలకు, ఈ విగ్రహానికి చాలా తేడాలు ఉన్నాయి. సుప్రీంకోర్టులో కొత్తగా ఏర్పాటుచేసిన న్యాయ దేవత విగ్రహానికి కళ్లకు గంతలు తీసేశారు. అంతేకాకుండా న్యాయ దేవత కుడి చేతిలో ఉండే త్రాసును అలాగే ఉంచగా, ఎడమ చేతిలో ఉండే పొడవైన కత్తిని తీసేసి ఆ స్థానంలో రాజ్యాంగాన్ని పెట్టారు. అంటే రాజ్యాంగం ప్రకారం అందరికీ సమానంగా న్యాయం జరుగుతుందని తెలియజేయడానికి దాన్ని అలా ఉంచారు. సుప్రీంకోర్టు జడ్జిల లైబ్రరీలో ఏర్పాటైన ఈ కొత్త న్యాయ దేవత విగ్రహానికి సంబంధించిన ఫోటోలు ప్రస్తుతం సోషల్ మీడియాలో తెగ వైరల్ అవుతున్నాయి.



చట్టానికి కళ్లు ఉండవని, దానికి గుర్తుగానే కోర్టుల్లో ఉండే న్యాయ దేవత విగ్రహానికి ఉండే కళ్లను గంతలతో కడతారని మనం ఇప్పటివరకు విన్నాం. అంతేకాకుండా ఎన్నో సినిమాల్లో చూశాం. న్యాయదేవతకు కళ్లు ఉండవని, చెవులు కూడా వినిపించవని పేర్కొంటారు. ఎందుకంటే డబ్బు, అధికారాన్ని బట్టి నిందితులకు చట్టాలు, తీర్పులు ఉండవని, న్యాయదేవత ముందు అందరూ సమానమేనని చెప్పేందుకే అలా ఉంచారు. అయితే ఈ న్యాయ దేవత విగ్రహాన్ని బ్రిటీష్ కాలంలో ప్రవేశపెట్టగా, ప్రస్తుత పరిస్థితులకు అనుగుణంగా మార్పులు అవసరమని భావించి ఈ నిర్ణయం తీసుకున్నారు. మనం కోర్టుల్లో చూసే న్యాయదేవత జస్టియా అనే గ్రీకు దేవత. జస్టిస్ అనే పదం నుంచి జస్టియా అనే పేరు వచ్చింది. 17వ శతాబ్దంలో ఒక బ్రిటిష్ కోర్టు అధికారి ఈ జస్టియా విగ్రహాన్ని మొట్టమొదటిసారిగా మన దేశానికి తీసుకువచ్చారు. ఆ తర్వాత 18వ శతాబ్దంలో బ్రిటిష్ కాలంలో న్యాయదేవత విగ్రహాన్ని కోర్టుల్లో ఉంచగా.. స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత అదే విగ్రహం కొనసాగుతూ వచ్చింది.

- శివరామచారి తాటికొండ

## శిక్షణ కార్యక్రమాలు వాయిదా వెయ్యాలి

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

ఉపాధ్యాయులకు ఇచ్చే శిక్షణలు నాన్ రెసిడెన్షియల్ పద్ధతిలో మండల కేంద్రాలలో లేదా రెండు మూడు మండలాలకు ఒక ప్రదేశంలో నిర్వహించాలని ఏపీటీఎఫ్ అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు మజ్జి మదన్మోహన్, ఎస్వి అనిల్ కుమార్ ఒక ప్రకటనలో ప్రభుత్వాన్ని కోరారు. 1, 2 తరగతులను బోధించే ఉపాధ్యాయులకు ఈ నెల 21 నుంచి 26 వరకు రెసిడెన్షియల్ పద్ధతిలో శిక్షణ ఇస్తున్నట్లు తెలుస్తుందని, ఇదే శిక్షణ రెసిడెన్షియల్ పద్ధతిలో 13 విడతలుగా డిసెంబర్ నెల ఆఖరి వరకు నిర్వహించినట్లు తెలియవస్తుందన్నారు. విద్యా సంవత్సరం మధ్యలో ఇటువంటి శిక్షణ నిర్వహించడం వల్ల విద్యాభివృద్ధి కుంటుపడటమే కాక, విద్యార్థులకు పరీక్షల నిర్వహణ వంటివి కూడా కష్టసాధ్యమవుతుందన్నారు. ఈ రెసిడెన్షియల్ పద్ధతిలో శిక్షణ ఇవ్వడం వల్ల వివిధ దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్న సీనియర్ ఉపాధ్యాయులు, బాలింతలు, చిన్నపిల్లల తల్లిదండ్రులు, వృద్ధులైన తల్లిదండ్రుల బాధ్యతలను చూసుకోవాల్సిన ఉపాధ్యాయులు తీవ్రమైన ఒత్తిడికి గురవుతారని, చాలా ప్రాథమిక పాఠశాలల్లో ఒకరు లేదా ఇద్దరు ఉపాధ్యాయులు పని చేస్తున్నందువల్ల విద్యా సంవత్సరం మధ్యలో బోధనకు ఇబ్బంది జరుగుతుందని, అందువల్ల వేసవి సెలవుల్లో శిక్షణ నిర్వహించాలని కోరారు. రెసిడెన్షియల్ సెక్షన్ పేరుతో సుదూర ప్రాంతాల్లో శిక్షణ ఇవ్వడం వలన ఉపాధ్యాయులు ఇబ్బందులకు గురి అవుతారని ఏపీటీఎఫ్ ఆ ప్రకటనలో పేర్కొంది.

YOUR TRUSTED PARTNER IN THE DISTANCE EDUCATION SECTOR.
SriAaKaSa
Join our Earn while Learn program and get a job within 40 days after joining.
LAST DATE: AUGUST-28
91330 06999 Courses 92466 36411
10th, Intermediate
BA (all groups), B.Com, BLISc, B.SC (all groups), BBA, BCA (with Market trending specialisations)
MA (all subjects), M. Com, MBA, MCA, M. SC (All Subjects), MLISc, M.Tech
Computer Applications, Cyber Security, Digital Marketing, Hospital Management, Tourism Management

ఎం.ఇర్షాద్
USHA ఆథరైజ్డ్ డీలర్స్
షాప్: 08942-229343
సెల్: 95731 43409
ఎ.కె. ఎంటర్‌ప్రైజెస్
ఉషా సెవింగ్ మిషన్స్, ఆఫీస్ ఫర్నిచర్..
అన్ని రకాల సెవింగ్ మిషన్లు, ఫేషన్ మేకర్స్, ఎంబ్రాయిడరీ మిషన్లు, స్పేర్ హోల్‌సేల్
రాజా కాంప్లెక్స్, కరెంట్ ఆఫీసు ఎదురుగా, జి.టి. రోడ్డు, శ్రీకాకుళం - 532 001

SAI OPTICIANS
సరస్వతి మహల్ ఎదురుగా, శ్రీకాకుళం
ప్రొప్రైయిటర్: బి.రమణమూర్తి
సెల్: 94407 59739
బ్రాంచ్ ఆఫీస్: గవర్నమెంట్ ఆర్ట్స్ కాలేజ్ రోడ్డు, శ్రీకాకుళం, సెల్: 94407 59739

MNM
బెంగుళూర్ అయ్యంగార్ బేకరి
BSNL ఆఫీస్ ప్రక్కన, జి.టి. రోడ్డు, శ్రీకాకుళం
సెల్: 76759 18522

మెట్రో సోఫా వర్క్స్
అన్ని రకముల సోఫాలు, ఫర్నిచర్ మేనుఫ్యాక్చర్స్ (హోల్‌సేల్ & రిటైల్)
షాపు నెంబరు 1, కొన్నవీధి, వన్‌వే ట్రాఫిక్ రోడ్డు, మాధవ మోటార్స్ దరి, శ్రీకాకుళం
సెల్: 83094 81129

SSJ
శ్రీ స్వర్ణ జ్యూయలరీ
ప్రొ: వాళ్ళ కిరణ్‌కుమార్
99636 89666, 90009 07133
జి.టి. రోడ్డు, శ్రీకాకుళం
E-mail: sriswarnajewelleries@gmail.com

జై శ్రీమన్నారాయణ
శ్రీ క్రిష్ణ ఆన్‌లైన్ సర్వీసెస్
మావద్ద అన్ని రకముల జాబ్ అప్లికేషన్స్ ఆన్‌లైన్ చేయబడును.
సెల్: 93938 41308
రైల్వే రిజర్వేషన్లు, బస్ రిజర్వేషన్ సదుపాయం కలదు.

Siva Srinivasa
Sofa Emporium
Lade Chandra Sekhar Rao
Ph. No: 94401 21710
63053 35395, sekharlifestyle99@gmail.com
NEAR SURYA MAHAL THEATRE WOMEN'S COLLEGE ROAD, SRIKAKULAM - 532 001

# పేదరిక నిర్మూలన అందరి బాధ్యత



(సత్యంన్యూస్,శ్రీకాకుళం)

పేదరిక నిర్మూలన అందరి బాధ్యతని కె.జి.ఎఫ్. అధ్యక్షులు బి.వి.ఎస్.ఎన్.రాజు పేర్కొన్నారు. గురువారం అంతర్జాతీయ పేదరిక నిర్మూలన దినోత్సవం సందర్భంగా చేపట్టిన ప్రత్యేక కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. నేటి సమాజాన్ని పట్టిపీడిస్తున్న అంశాల్లో పేదరికం ఒకటని, పేదరిక నిర్మూలనకు ప్రభుత్వాలు ఎంత కృషి చేసినా ప్రజలు తమవంతు బాధ్యత వహించాలన్నారు. ద్రవ్యోల్బణం, పేదల వృద్ధిరేటు, గ్రామీణ ప్రాంతాల్లో అప్పులు, పట్టణాలకు వలసలు, ప్రభుత్వ ఆర్థిక, రాజకీయ విధానాలు, సంస్కరణల అమలులో అసమర్థత, నిరక్షరాస్యత, నిరుద్యోగం, నిత్యావసరాలు, విద్య, వైద్య ఖర్చులు గణనీయంగా పెరగడం పేదరికానికి ప్రధాన కారణాలుగా పేర్కొన్నారు.

# ఒకడుగు ముందుకు.. నాలుగడుగులు వెనక్కి

(మొదటిపేజీ తరువాయి)

పాలసీ అంటూ హడావుడి చేసినా మార్గదర్శకాలు రూపొందించడంలో విఫలమైందనే విమర్శలను ఎదుర్కొంటుంది. జిల్లాలో కొత్తూరు మండలం నివగాం, శ్రీకాకుళం పరిధిలోని హయాతినగరం, బట్టేరు, నరసన్నపేట పరిధిలోని గోపాలపెంట, గార మండలంలోని బూరవల్లి, అంబళ్లపేటకు టెండర్లు పిలిచారు. వీటికి మొత్తం 38 మంది ఆన్‌లైన్‌లో టెండర్లు దాఖలు చేశారు.

**ఎమ్మెల్యే వర్సెస్ పార్టీ అధ్యక్షుడు**

పాతపట్నం నియోజకవర్గం కొత్తూరు మండలం నివగాం రీచ్‌ను టెండర్ల ప్రక్రియ నుంచి చివరి నిమిషంలో మినహాయించారు. నోటిఫికేషన్‌లో దీనికి టెండర్లు ఆహ్వానించి ఆ తర్వాత రద్దు చేయడంపై టెండరుదారులు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. ఇక్కడ స్థానిక ఎమ్మెల్యే, టీడీపీ జిల్లా పార్టీ అధ్యక్షుడి మధ్య సయోధ్య కుదరకపోవడంతో ర్యాంపు వ్యవహారం రోడ్డుకెక్కింది. నాయకులు పరస్పరం ఉన్నతాధికారులపై ఒత్తిడి తీసుకురావడంతో ఏకంగా దీన్ని టెండరు ప్రక్రియ నుంచి తప్పించినట్లు తెలుస్తుంది. సోమవారం తెరిచిన మొత్తం 38 టెండర్లలో ఆరు రీచ్‌లకు 18 మాత్రమే అర్హత సాధించాయని మంగళవారం నాటికి తేల్చారు. బుధవారం ఆరు రీచ్‌లను ఐదు రీచ్‌లుగా చూపించి 9 సంస్థలకు కుదించారు. ప్రస్తుతం 5 రీచ్‌లకు మూడు ఏజెన్సీలు మాత్రమే అర్హులను తేల్చారు. గురువారంనాటికి ఈ మూడు ఏజెన్సీలకు కూడా అర్హత లేదని పక్కన పెట్టేశారు. వార్షిక, నెలవారీ టర్నోవర్, అనుభవం వంటి కొత్త మార్గదర్శకాలతో తప్పించేశారు.

**కలెక్టర్ ఆగ్రహం**

గురువారం జిల్లాస్థాయి ఇసుక కమిటీతో కలెక్టర్ వర్చువల్‌గా టెండర్ల వ్యవహారంపై కలెక్టరేట్ నుంచే మాట్లాడినట్టు తెలిసింది. టెండర్ల ప్రక్రియలో టెక్కలి ఆర్డీవో, మైన్స్ డీడీ వ్యవహారంపై కలెక్టర్ ఆగ్రహం వ్యక్తం చేసినట్టు తెలిసింది. టెక్కలి ఆర్డీవో సొంత నిర్ణయాలు తీసుకోవడంపై కలెక్టర్ అక్షింతలు వేసినట్టు విశ్వసనీయ సమాచారం. ఖరారైన ప్రతీ సంస్థపైనా ఏదో ఒక ఫిర్యాదు రావడంతో టెండర్ల ప్రక్రియను తాత్కాలికంగా పక్కన పెట్టాలని ఆదేశించినట్టు తెలిసింది.

**కొత్తగా మరో ఆరు**

కొత్త నోటిఫికేషన్‌లో ఆమదాలవలస పరిధిలో ముద్దాడపేట, పురుషోత్తపురం-1,2, ఎచ్చెర్ల పరిధిలో ముద్దాడపేట, శ్రీకాకుళం పరిధిలో కిల్లిపాలెం, నరసన్నపేట పరిధిలో పర్లాంలో ఇసుకను మాన్యువల్‌గా ట్రాక్టర్లలో లోడ్ చేసి స్టాక్‌పాయింట్‌కు తరలించి ఇసుకను వినియోగదారులకు లోడ్ చేసి ఇవ్వాలి. ఒక మెట్రిక్ టన్ను ఇసుకను గరిష్టంగా రూ.110, కనిష్టంగా రూ.90కి తగ్గకుండా బిడ్ దాఖలు చేయాలి. మొదటిసారి ఇచ్చిన నోటిఫికేషన్‌లో గరిష్టంగా రూ.110కి మించకుండా బిడ్ దాఖలు చేయాలని సూచించి రెండోసారి ఇచ్చిన నోటిఫికేషన్‌లో కనిష్టధరను పేర్కొన్నారు. మొదటి సారి ఇచ్చిన ఆరు రీచ్‌లకు టెండర్లు ఆహ్వానించినప్పుడు వచ్చిన బిడ్‌లో రూ.19, రూ.61, రూ.83 కోట్ చేసినవారు ఉన్నారు. వాస్తవంగా ఈ ధర గిట్టుబాటు కాదు. అయినా తక్కువకు కోట్ చేశారు. అవ్వాకావాలి, బువ్వాకావాలి అంటే ఇసుక పాలసీ ఎప్పటికీ ఒక కొలిక్కి రాదు. నిబంధనల మేరకే కాంట్రాక్ట్ అప్పగించాలంటే తెలుగుదేశం నేతలకు రాదు. లేదూ తెలుగుదేశం నేతలకు కాంట్రాక్ట్ కావాలంటే నిబంధనలు సడలించాలి. లేదంటే గత ప్రభుత్వం అనుసరించిన విధానంలాగే ఉంటుంది. కాకపోతే చంద్రబాబు ఉచిత ఇసుకని హామీ ఇచ్చారు కాబట్టి దీనిని దృష్టిలో పెట్టుకొని వ్యవహరించాలి.

# ఎస్పీని కలిసిన పోలీసులు అధికారులు

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)



ఎస్పీ కేవీ మహేశ్వర రెడ్డిని గురువారం ఉదయం జిల్లా పోలీస్ కార్యాలయం ఏపీఎస్పీ మొదటి బెటాలియన్ అదనపు కమాండెంట్ పి.సత్తిబాబు, కాశీబుగ్గ రూరల్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ ఎం.తిరుపతిరావు, డిసిఆర్బి ఎస్ఐ ఎం.డి.అమీర్ అలీ మర్యాద పూర్వకంగా కలిసి పూల మొక్కలను అంద జేశారు. జిల్లాలో నూతనంగా ఏర్పడిన ఏపీఎస్పీ (ఎచ్చెర్ల) మొదటి బెటాలియన్ అదనపు కమాం డెంట్‌గా పి.సత్తిబాబు గురువారం ఎచ్చెర్లలో బాధ్యతలు చేపట్టారు. అనంతరం ఆయన జిల్లా పోలీసు కార్యాలయంలో జిల్లా ఎస్పీ మహేశ్వర రెడ్డి ఐపీఎస్‌ని కలిసి పూలమొక్కను అందజేశారు. ఆయన ఇదివరకు ఇంటెలిజెన్స్ విభాగంలో విధులు నిర్వర్తిస్తూ బదిలీపై మొదటి ఏపీఎస్పీ బెటాలియన్ అదనపు కమాండెంట్‌గా బాధ్యతలు చేపట్టారు. సాధారణం బదిలీల్లో భాగంగా కాశీబుగ్గ రూరల్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ బాధ్యతలు చేపట్టిన ఎం.తిరుపతిరావు, డిసిఆర్బి ఎస్ఐ ఎం.డి.అమీర్ అలీ ఎస్పీని మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు.







**అద్దెకొరకు**

శ్రీకాకుళంలో డే అండ్ నైట్ జంక్షన్ వద్ద గల లయా ల్యాబ్ బిల్డింగ్‌లోని సెకండ్ ఫ్లోర్, థర్డ్ ఫ్లోర్ (22x150) కామన్ హాల్ మెడికల్ హోల్‌సేల్ షాపులకు గాని, డాక్టర్ ప్లాజాకు గాని, ఆఫీసులకు గాని అద్దెకు ఇవ్వబడును.

- సంప్రదించగలరు -

94403 72300, 98487 96626


# పల్లెపండగతో పల్లెల అభివృద్ధి



(సత్యంన్యూస్, శ్రీకాకుళం రూరల్)

పల్లెల అభివృద్ధే లక్ష్యంగా పల్లెపండుగ కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని ఎమ్మెల్యే గొండు శంకర్ అన్నారు. కళ్లేపల్లి, పీజీ పేట, నైర, పొన్నాం, బట్టేరు ప్రాంతాల్లో పలు అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే శంకర్ గురువారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజలు తమపై పెంచుకున్న నమ్మకాన్ని వమ్ము చేయకుండా పల్లె ప్రాంతాల అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ చూపుతుందన్నారు. ఏ గ్రామంలో ఏ పనులు అవసరమో అవి పూర్తిచేసేందుకు తగ్గ నిధులు కూడా విడుదల చేశామన్నారు. మంచి పాలన అందించడమే పాలకుల లక్ష్యమని అందుకు అనుగుణంగా కూటమి ప్రభుత్వం పని చేస్తుందని ఎమ్మెల్యే వివరించారు. కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత గ్రామాల్లో మౌలిక సదుపాయాలు పెద్దఎత్తున కల్పించేందుకు మునుపెన్నడూ జరగని విధంగా గ్రామ పంచాయతీల అభివృద్ధికి వారం రోజులపాటు పల్లెపండుగ వారోత్సవాలను నిర్వహిస్తున్నట్టు చెప్పారు. నియోజకవర్గంలో సీసీ రోడ్లు, బీటీ రోడ్లు, సీసీ డ్రైన్లు, గోకులాలను పెద్దఎత్తున అన్ని గ్రామాల్లో నిర్మిస్తామన్నారు. ఉపాధి నిధులతో నియోజకవర్గంలో పెద్దఎత్తున అభివృద్ధి పనులు చేస్తామన్నారు. మంచి కార్యక్రమాన్ని రూపుదిద్దిన ముఖ్యమంత్రి చంద్రబాబుకు, ఉపముఖ్యమంత్రి పవణ్ కళ్యాణ్‌కు ధన్యవాదాలు తెలిపారు. ప్రజా సంక్షేమ పాలనే ధ్యేయంగా ప్రభుత్వం పనిచేస్తూ పేదలందరికీ సంక్షేమ పథకాలు అందించే దిశగా కృషిచేస్తుందని వివరించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు, ఎంపీడీవోలు, అధికారులు పాల్గొన్నారు.

# ఆధ్యాత్మిక జ్ఞాన సంపన్నుడు వాల్మీకి మహర్షి

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

భారతదేశానికి ఆధ్యాత్మిక జ్ఞానాన్ని ప్రసాదించిన జ్ఞాన సంపన్నుడు వాల్మీకి మహర్షి అని ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డి అన్నారు. వాల్మీకి మహర్షి జయంతి సందర్భంగా గురువారం జిల్లా పోలీసు కార్యాలయంలో ఎస్పీ వాల్మీకి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వాల్మీకి మహోన్నతమైన జీవితం, రచనలు, కావ్యాలు ప్రతి ఒక్కరు ఆదర్శంగా తీసుకొని సన్మార్గంలో నడవాలని కోరారు. రామాయణం లాంటి మహాకావ్యాన్ని రచించి, సమాజానికి అందించిన వాల్మీకి చూపిన దారి మనందరికి అనుసరణీయమన్నారు. మానవునిగా ప్రతిఒక్కరూ అనుసరించవలసిన ఆదర్శకావ్యం రామాయణమని మహాకావ్యం విశిష్టతను గుర్తు చేశారు. కార్యక్రమంలో డీఎస్పీ ఎల్.శేషాద్రి, కార్యాలయ పరిపాలన అధికారి సీహెచ్ గోపీనాథ్, ఇతర పోలీసు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



# శ్రీ సుబ్రహ్మణ్య స్వామికి అష్టోత్తర పుస్తకార్చన

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)



ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని అనంతపురం జిల్లాలో గల పంపనూరు క్షేత్రంలో ఉన్న 15వ శతాబ్దం నాటి శ్రీ సుబ్రహ్మణ్య స్వామి ఆలయంలో అష్టోత్తర పుస్తకార్చన నిర్వహించారు. కాశిన వెంకటేశ్వరరావు, రమణమ్మ దంపతులు తమ స్వీయరచనగా 'శ్రీ కార్తికేయ వైభవం' అనే 108 పుస్తకాలతో విశ్వజయము గ్రూప్ సభ్యుల శ్రేయస్సు కోసం స్వామి వారికి అర్చన జరిపించి, వాటిని భక్తులకు వితరణ చేయమని ప్రధానార్చకులు ఎన్.సీతారామ మోహనశర్మ, ఎన్.సాయి నాగరాజులకు అందజేశారు. ఈ పుస్తకంలో కార్తికేయుని చరిత్ర, పురాణ ప్రసిద్ధ, సుప్రసిద్ధ, విచిత్ర, విభిన్న నామాలతో గల సుబ్రహ్మణ్య స్వామికి చెందిన 108 క్షేత్రాల విశేషాలను, ఆరాధనా స్తోత్రాలను పొందుపర్చినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.



# కలెక్టరేట్‌లో వాల్మీకి జయంతి

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

కలెక్టరేట్‌లో వాల్మీకి జయంతి సందర్భంగా వాల్మీకి చిత్రపటానికి కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ గురువారం నివాళులర్పించారు. ఈ సందర్భంగా వాల్మీకిచరిత్రను గుర్తు చేశారు. కార్యక్రమంలో జేసీ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్‌తోపాటు డీఆర్వో ఎం.అప్పారావు, బీసీ సంక్షేమ అధికారిణి అనురాధ, డీఎంహెచ్ఓ డాక్టర్ బి మీనాక్షి, ఉమెన్ వెల్ఫేర్ పీడీ బి.శాంతిశ్రీ, ఆర్ఐఓ దుర్గారావు, ఎటిడబ్ల్యూఓ శ్రీనివాసరావు, విద్యాశాఖ ఎడి లియాఖత్ అలీఖాన్ పాల్గొన్నారు.

# బాలల సంరక్షణ కేంద్రాలు రిజిస్ట్రేషన్ తప్పనిసరి

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)



బాలల సంరక్షణ కేంద్రాలు రిజిస్ట్రేషన్ తప్పనిసరిగా ఉండాలని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ ఆదేశించారు. గురువారం కలెక్టరేట్‌లో బాలల రక్షితగృహాల నిర్వహణపై సంబంధిత అధికారులు స్వచ్ఛంద సంస్థలతో సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో 11బాలల సంరక్షణ కేంద్రాలకు మాత్రమే రిజిస్ట్రేషన్ కలిగి ఉన్నాయన్నారు. ప్రస్తుతం జిల్లాలో 13కేంద్రాలు రిజిస్ట్రేషన్ లేకుండా నడుస్తున్నట్లు తెలిపారు. రిజిస్ట్రేషన్ లేకుండా బాలల సంరక్షణ కేంద్రాలు నిర్వహించే కేంద్రాలపై కేసు నమోదు చేయాలని అధికారులను ఆదేశించారు. అనుమతులు లేని బాలల సంరక్షణ కేంద్రాలను తక్షణమే మూయించాలని ఆదేశించారు. రిజిస్ట్రేషన్ లేకుండా నడుపుతున్న బాలల సంరక్షణ కేంద్రాలలో ఉన్న బాలలను ప్రభుత్వ వసతి గృహాల్లో చేర్పించాలన్నారు. వసతిగృహాల్లో సీట్ల కేటాయింపుకు డిఈఓ, ఐసీడీఎస్ పీడీలతో కమిటీకి ఫిర్యాదుల ఇవ్వాలన్నారు. బాలల రక్షితగృహాలలో దత్తతకు అర్హులైన బాలల వైద్య పరీక్షల నివేదికలు వెంటవెంటనే మహిళా శిశుసంక్షేమ అధికారిణికి సమర్పించాలన్నారు. ప్రైవేటు వసతిగృహాల రిజిస్ట్రేషన్లు డీఈవో వద్ద చేయించుకోవాలన్నారు. మహిళా శిశు సంక్షేమ శాఖ పీడీ బి.శాంతిశ్రీ మాట్లాడుతూ స్వచ్ఛందసంస్థలు నిర్వహిస్తున్న బాలల సంరక్షణ కేంద్రాలు బాలల న్యాయచట్టం ప్రకారం ప్రభుత్వ నిబంధనలననుసరించి రిజిస్ట్రేషన్ చేయాలన్నారు. మునగచెట్లు మహిళలకు ఆరోగ్యానికి తొలిమెట్టు అనే పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సమావేశంలో ఆర్డీఓ కె.సాయిప్రత్యూష, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ బి.మీనాక్షి, బాలల సంరక్షణ అధికారి కె.రమణ, ఆర్ఐఓ దుర్గారావు, సాంఘిక సంక్షేమ శాఖ ఉపసంచాలకులు విశ్వమోహన్ రెడ్డి, వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ సంక్షేమ అధికారిణి అనురాధ, విద్యాశాఖ ఎడి లియాఖత్ అలీఖాన్, గిరిజన సంక్షేమశాఖ ఎటిడబ్ల్యూఓ శ్రీనివాసరావు, స్వచ్ఛంద సంస్థలు, తదితరులు పాల్గొన్నారు.

# ఆర్ట్స్ కాలేజీలో వాల్మీకి జయంతి

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

ప్రభుత్వ పురుషులు డిగ్రీ కళాశాలలో వాల్మీకి జయంతి కార్యక్రమాన్ని కళాశాల ఇన్‌ఛార్జ్ ప్రిన్సిపల్ ఎం.వి.సత్యనారాయణ ఆధ్వర్యంలో గురువారం ఘనంగా నిర్వహించారు. ముందుగా వాల్మీకి చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. అనంతరం ఆంధ్ర యూనివర్సిటీ విశ్రాంత సంస్కృతిక ప్రధానాచార్యులు జి.ఎ.శర్మ వాల్మీకి రామాయణం మానవీయ కోణం అనే అంశం, రామాయణం ఆవశ్యకత, ఏడు ఖండాల విశిష్టత గురించి వివరించారు. కళాశాల ఇన్‌ఛార్జ్ ప్రిన్సిపాల్ సత్యనారాయణ రామాయణం విద్యార్థినీ విద్యార్థులు మంచి జీవన విధానాన్ని ఏ విధంగా కొనసాగించాల అన్న అంశాన్ని తెలియజేశారు. కళాశాల సంస్కృతిక ప్రధానాచార్యులు రామారావు మాట్లాడుతూ వాల్మీకి రామాయణం ప్రస్తుతం అన్వయించుకొని సరైన జీవన విధానాన్ని కొనసాగించాలని సూచించారు. కార్యక్రమంలో కళాశాల ఐక్యుఏసి కో-ఆర్డినేటర్ హరిత, కళాశాల అకాడమిక్ కోఆర్డినేటర్ ఎస్.శశిభూషణరావు, పీవీ రమణ, సీహెచ్ రామమూర్తి, రవికుమార్, శ్రీనివాస్ పాత్రో, పోలినాయుడు, చలమయ్య, నారాయణరావు, డిలేశ్వరరావు, చంద్రభూషణరావు, వాసుదేవరావు, భుజంగరావు, ప్రతిష్ట, వరలక్ష్మి, శంకర్ మొదలగు అధ్యాపకులు, విద్యార్థిని విద్యార్థులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.




# క్విట్‌ఇండియా ఉద్యమ స్మృతివనం ఏర్పాటుచేయాలి

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

ఈస్ట్‌కోస్ట్ రైల్వే జనరల్ మేనేజర్ పంక్వల్ పరమేశ్వరన్ బుధవారం దూసి రైల్వేస్టేషన్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా ఇంటాక్ శ్రీకాకుళం విభాగం అదనపు కన్వీనర్ వావిలపల్లి జగన్నాథ నాయుడు, సీనియర్ సభ్యులు కొమ్ము రమణమూర్తి, పొన్నాడ రవికుమార్‌లు ఆయనను కలిశారు. దూసి రైల్వేస్టేషన్‌ను 1942 జూన్ 6న గాంధీజీ సందర్శించిన విషయాన్ని తెలిపారు. అలాగే మహాత్మ గాంధీ నాటిన మొక్క వృక్షంగా మారిన వైనాన్ని వివరించారు, అదే రోజు జరిగిన సభలో మహాత్మగాంధీ ప్రసంగించిన స్థలాన్ని చూపించారు. దూసి రైల్వేస్టేషన్‌లో మహాత్మగాంధీ విగ్రహాన్ని స్థాపించాలని, వారి పర్యటన వివరాలతో శిలాఫలకాన్ని, అలాగే ఆయన ప్రసంగించిన స్థలం, రెండు ఎకరాల్లో క్విట్ ఇండియా ఉద్యమ స్మృతి వనాన్ని ఏర్పాటు చెయ్యాలని, ప్రతిపాదనలు చేశారు. వీటిపై సానుకూలంగా స్పందించిన పంక్వల్, విశాఖపట్నంలో ఈ ప్రతిపాదన పరిశీలించామని, త్వరలో ప్రతిపాదనలపై చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు. ఈ పర్యటనలో విశాఖపట్నం డీఆర్ఎం సౌరబ్ ప్రసాద్, ఈస్ట్‌కోస్ట్ రైల్వే బృందంతో పాటు, స్థానిక అధికారులు పాల్గొన్నారు.




# సువర్ణావకాశాన్ని సద్వినియోగం చేసుకోండి

(సత్యంన్యూస్, శ్రీకాకుళం అర్బన్)



మన మట్టి క్రీడ ఖోఖో అని, జిల్లా క్రీడాకారులు ఈ సువర్ణావకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఖోఖో చైర్మన్ పొన్నాడ రవికుమార్ అన్నారు. అంతర్జాతీయ స్థాయిలో మరో కీలక అడుగు వేయబోతోందని, ఈ క్రీడలో తొలిసారి ప్రపంచకప్ నిర్వహించబోతున్నారని తెలిపారు. ఈ మెగా టోర్నీకి భారత్ ఆతిథ్యమివ్వనుందని, వచ్చే ఏడాది జనవరి 13 నుంచి 19 వరకు స్థానిక ఇందిరా గాంధీ స్టేడియంలో ఈ ప్రపంచకప్ జరుగుతుందని బుధవారం నిర్వాహకులు ప్రకటించారు. పురుషులు, మహిళల విభాగాల్లో కలిపి మొత్తం 24 దేశాలు ఇందులో పోటీ పడనున్నట్లు తెలిపారు.

Printed by N.V.S. prasad, at Srikakulam and published by SATYAM PRINTERS, plot No. 8, Santamma colony, Srikakulam- 532001, Andhrapradesh on behalf of SANCHALANA SAYANKALA PATRIKA SATYAM, Srikakulam. Editor N.V.S. Prasad, Srikakulam, Andhra Pradesh. APTEL No. 2005/17967. Postal Reg. No. D/RNP/SKL-12/12-15.